## క్లుప్తంగా

### విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**అరకులోయటౌన్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈనెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ తెలిపారు. అలాగే డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు 'విద్యార్థులపై మాదక ద్రవ్యాలు, మత్తుదార్థాల ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్టు ఆయన చెప్పారు. విజేతలకు ఈనెల 29న బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఎన్ఎస్ఎస్ పీవోలు పసుపులేటి నాగబాబు, వై.విజయలక్ష్మి, మొష్యా అనిత కుమారి, అధ్యాపకులు గణేష్, పి.సుందరి రాణి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పాల్గుణ పరామర్శ



గెన్ను కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాల్గుణ, పార్టీ నాయకులు

**అరకులోయ రూరల్:** మండలంలో చొంపి పంచాయతీ కేంద్రానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జల్లేడి గెన్ను తండ్రి పండు(68) ఇటీవల మృతి చెందారు. దీంతో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మంగళవారం చొంపి వెళ్లి గెన్నుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ముఖి సొంబ, జీనబంధు,శెట్టి వెంకటరావు,జి.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



గిరిజన సంఘం నాయకులు అందజేసిన నోట్ పుస్తకాలతో విద్యార్థులు

**అరకులోయ రూరల్:** మండలంలో బొండం పంచాయతీ రంపుడువలస, మజ్జివలస, బొండం ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న 80 మంది విద్యార్థులకు గిరిజన సంఘం మండల అధ్యక్షుడు చిన్నబాబు, కార్యదర్శి బుజ్జిబాబు మంగళవారం నోట్ పుస్తాకాలను పంపిణీ చేశారు. దాతల ఆర్థిక సాయంతో వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అప్పన్న,సత్యారావు,వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

### 1700 పశువులకు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

**డుంబ్రిగుడ:** మండలంలోని సొవ్వ పంచాయతీ పరిధిలో మంగళవారం మెగా పశు వైద్య శిబిరం నిర్వహించారు. వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు 1700 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. పశువులకు పుండ్లు రాకుండా ఉండేందుకు ఈ టీకా అవసరమని పశు వైద్యాధికారి రాజశ్రీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసన్ సంస్థ ప్రతినిధులు నరసింహారావు, రఘు, పశు వైద్య సిబ్బంది త్రినాథరావు, సంజీవరావు, మనోజ్ కుమార్, జయరాజు, రమేష్, ప్రకాష్, అప్పారావు, అనంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**రాజవొమ్మంగి :** ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మిరియాల శిరీషా దేవి అన్నారు. ఆమె మంగళవారం కిర్రాబు, లబ్బర్తి పంచాయతీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామస్తుల నుంచి వినతి పత్రాలు స్వీకరించి, మాట్లాడారు. లబ్బర్తిలో ఎమ్మెల్యే శిరీషదేవి దంపతులను స్థానికులు సత్కరించారు.





### పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి

గిరిజన ప్రాంతంలోని ఆస్పత్రుల ఆవరణల్లో పోలీస్ ఔట్‌పోస్ట్ ఏర్పాటు చేయాలి. సకాలంలో వైద్యం అందించినప్పటికీ పలువురు రోగుల బంధువులు వైద్య సిబ్బందిపై దాడులు చేస్తున్నారు. రోడ్డు ప్రమాద కేసుల్లో బాధితుల బంధువులు మద్యం సేవించి వచ్చి దౌర్జన్యాలకు దిగుతున్నారు. వారి నుంచి రక్షణ కల్పించేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. – **ఎం.రాజేశ్వరి, హెడ్ నర్స్, ఏరియా ఆస్పత్రి, అరకులోయ.**

### దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలి



కోల్‌కతలో డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేయడం అమానుషం. నిందితులను కఠినంగా శిక్షిస్తేనే మళ్లీ ఇటువంటి దారుణాలు జరగవు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. – **వి. స్వర్ణలత, హెడ్ నర్స్, ఏరియా ఆస్పత్రి అరకులోయ**

– అరకులోయటౌన్

# ఆకట్టుకుంటున్న భారీ గణనాథులు



పాడేరులో అమ్మకాలకు సిద్ధమైన భారీ గణపతి విగ్రహాలు



ఐదు అడుగుల గణపతి విగ్రహాలు

**సాక్షి,పాడేరు:** వినాయకచవితి ఉత్సవాలు దగ్గర పడుతుండడంతో విక్రయాల కోసం రంగురంగుల గణనాథుని విగ్రహాలను వ్యాపారులు సిద్ధం చేశారు. పాడేరులో ఆరు దుకాణాల్లో వ్యాపారులు అమ్మకాలను ప్రారంభించారు.చిన్న బొమ్మలు అడుగు రూ.1500, 10 అడుగుల నుంచి ఇంకా ఎత్తులో ఉంటే అడుగు రూ.2,000కు విక్రయిస్తున్నారు.

పాడేరు, హుకుంపేట, పెదబయలు, జి.మాడుగుల, డుంబ్రిగుడ, అరకులోయ, ముంచంగిపుట్టు మండలాల్లోని అన్ని గ్రామాల్లో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహకులు పాడేరు పట్టణంలోనే ప్రతి ఏడాది విగ్రహాలను కొనుగోలు చేస్తారు.దీంతో భారీగానే విగ్రహాలను అమ్మకానికి సిద్ధం చేశారు. ఉత్సవాల నిర్వాహకులు బొమ్మలను పరిశీలించి అడ్వాన్స్‌లు చెల్లిస్తున్నారు.గణనాథుని భారీ విగ్రహాలు చూపరులను ఎంతో ఆకర్శిస్తున్నాయి.

## ఉద్యోగుల సేవలు అభినందనీయం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, తహసీల్దార్

**గంగవరం:** మండలంలో ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు అందిస్తున్న సేవలు అభినందనీయమని, జిల్లా, డివిజన్ స్థాయిలో మండల అధికారులకు, ఉద్యోగులకు అవార్డులు లభించడం చాలా ఆనందదాయకమని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీరత్నం, తహసీల్దార్ సీహెచ్. శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం పిడతమామిడి గ్రామ సచివాలయంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ యెజ్జు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ నేసం మరిడమ్మ అధ్యక్షతన జిల్లా, డివిజన్ స్థాయి అవార్డు గ్రహీతలకు అభినందన సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, తహసీల్దార్ ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ అవార్డులు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా అవార్డులు అందుకున్న డిప్యూటీ తహసీల్దార్ వీరభద్రరావు, ఆర్ఐ ఫయాజ్‌భాషా(జిలానీ), తహసీల్దార్‌కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ జి.సురేష్, ఎంఈవో ఆఫీస్ కంప్యూటర్ ఆపరేటర్ సీహెచ్. సురేష్, పిడతమామిడి పంచాయతీ కార్యదర్శి వెంకట సురేష్, డివిజన్ స్థాయి అవార్డులు అందుకున్న శివ గణేష్, రామాయమ్మ, రాజ్యలక్ష్మి తదితరులను దుశ్శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, ఎంపీటీసీ కనకలక్ష్మి , సర్పంచ్‌లు పార్వతి, కె.లక్ష్మి, రీ సర్వే డీటీ రాంబాబు, బయ్యనపల్లి దొర, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ రమణారెడ్డి, పిడతమామిడి వార్డు మెంబర్లు చిట్టిబాబు, కనకలక్ష్మి పాల్గొన్నారు.

## 171 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**డుంబ్రిగుడ:** మానవ హక్కుల నేర నిరోధక సంఘం రూరల్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యులు రాంబాబు పర్యవేక్షణలో మంగళవారం పీహెచ్‌సీలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది సేవలందించారు. 171 మందికి కంటి వైద్య పరీక్షలు జరిపారు. వీరిలో 36 మందికి కంటి శుక్లాల సమస్యలు ఉన్నట్టు గుర్తించారు, మరో 39 మందికి కళ్లద్దాల అవసరంతో పాటు మిగిలిన వారికి సాధారణ సమస్యలు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎల్.వి. ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్యులు సంతోష్, స్థానిక పీహెచ్‌సీ హెచ్ఎస్ సారీ, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**డుంబ్రిగుడ:** స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉషారాణి తెలిపారు. ఎంపీపీ బాకా ఈశ్వరి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, 18 పంచాయతీల సర్పంచ్‌లు, 14 సెంగ్మెంట్‌ల ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని కోరారు.

## జాతీయ నేత్రదాన పక్షోత్సవ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, పీహెచ్‌సీ వైద్యుడు రాంబాబు

**డుంబ్రిగుడ:** జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని స్థానిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రం డుంబ్రిగుడలో ర్యాలీ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హైవే, మూడు రోడ్ల జంక్షన్ మీదుగా బీఎస్ఎన్ఎల్ టవర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ అన్ని దానాల కన్నా నేత్రదానం మిన్న అని, నేత్రదానం చేయడం వల్ల అంధత్వం గలవారికి చూపును ప్రసాదించవచ్చని చెప్పారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ నేత్రదానం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్‌వో సారి, హెల్త్ అసిస్టెంట్లు శెట్టి స్వామి, రవీంద్ర, హరికృష్ణ, ప్రభాకర్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఏపీటీఎఫ్ నాయకులకు నివాళి



నివాళులర్పిస్తున్న ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు, ఉపాధ్యాయులు

**చింతపల్లి:** దివంగత ఏపీటీఎఫ్ నాయకులు సింగరాజు రామకృష్ణయ్య, గుల్లేపల్లి సింహాద్రిల సేవలు మరువలేనివని చింతపల్లి ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడులు అన్నారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో వారి చిత్రపటాలకు మంగళవారం పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయసంఘాల నాయకులు శశికుమార్, గంగరాజు, నర్సింగరావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎంపీకి వినతి



ఎంపీ తనూజ రాణికి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**ముంచంగిపుట్టు:** మండలంలోని కించాయిపుట్టు పంచాయతీలో పలు సమస్యల పరిష్కరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ మండల నేతలు సన్యాసిరావు,తిరుపతిరావు పాడేరులో ఎంపీ తనూజ రాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్ కాలనీలో సీసీ రోడ్లు,పలు గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీలు వంటి సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

## టీడీపీ కార్యకర్తపై ఫిర్యాదు



ఎస్ఐ శ్రీనివాసరావుకు ఫిర్యాదు జేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**కూనవరం:** ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త చెలికాని ఉమాపై వైఎస్సార్‌సీపీ కూనవరం, వీఆర్‌పురం మండలాల ప్రజా ప్రతినిధులు, మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్‌లు కట్టం లక్ష్మి, సున్నం అభిరామ్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆవుల మరియాదాస్, వీఆర్‌పురం మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు, మాజీ వైఎస్ ఎంపీపీ గుజ్జాబాబు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దీకొండ గంగాధర్, కొమ్మాని మోహన్‌రావు, పొడియం గోపాల్, మండల మహిళా ఉపాధ్యక్షురాలు కొమ్మాని సునీతలు మాట్లాడుతూ చెలికాని ఉమా స్థాయి మరచి వ్యాఖ్యానిస్తున్నాడన్నారు. ఎమ్మెల్సీ అనంత బాబుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడితే ప్రజలు తగిన బుద్ధిచెపుతారని హెచ్చరించారు.

## ప్రాంతీయ ఆస్పత్రిలో వైద్యుల పోస్టులు భర్తీచేయాలి

చింతపల్లి జెడ్పీటీసీ బాలయ్య



చింతపల్లి ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతితో మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య

**చింతపల్లి:** స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న వైద్యనిపుణులు, సిబ్బంది పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని చింతపల్లి జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య కోరారు. సోమవారం ఇక్కడ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి ప్రైవేటు ఎలక్ట్రీషియన్ లక్ష్మణ్ తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే, ఈఘటన నేపథ్యంలో జెడ్పీటీసీ మంగళవారం చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిని సందర్శించారు. ఆస్పత్రిలో నెలకొన్న లోపాలను గమనించారు. వైద్యసిబ్బంది, నిపుణులు లేకపోవడం వల్ల ఇక్కడకు వచ్చిన రోగులందరినీ మైదాన ప్రాంతాల ఆస్పత్రులకు రిఫర్‌చేస్తున్నారన్నారు. దీనివల్ల కొందరి ప్రాణాలు పోతున్నాయని చెప్పారు. రోగులను పరామర్శించి వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.వైద్యులు, సిబ్బందిని నియమించాలని కలెక్టర్‌ను కోరామని జెడ్పీటీసీ తెలిపారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, నాయకులు నరేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### పీవీటీజీ గ్రామాల్లో అభివృద్ధి పనులు



సాగులు గ్రామంలో వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

**గూడెంకొత్తవీధి:** ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో మారుమూల ఉన్న పీవీటీజీ గ్రామాల్లో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయనున్నట్టు గూడెంకొత్తవీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాగులు గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సందర్శించిన ఎంపీడీవో మాట్లాడుతూ అభివృద్ధికి నోచుకోని గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. ఈకార్యక్రమంలో దేవరపాల్లి పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గాయపడిన ఎలక్ట్రీషియన్‌కు ఆర్థికసాయం

మెరుగైన వైద్యసేవల కోసం కేజీహెచ్‌కు తరలింపు



ఎలక్ట్రీషియన్ లక్ష్మణ్‌కు ఆర్థికసాయం అందిస్తున్న ప్రభావతి, చిత్రంలో సర్పంచ్ పుష్పలత

**చింతపల్లి:** స్థానిక ప్రాంతీయ ఆస్పత్రిలో సోమవారం జరిగిన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ప్రమాదంలో గాయపడిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ గుల్లెల లక్ష్మణ్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్‌కు తక్షణ సాయంగా ప్రభుత్వం తరపున ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందించారు. చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత తన సొంత సొమ్ము రూ.5వేలు సాయంగా అందజేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభావతి తమ వ్యక్తిగత నిధులు కొంత సాయంగా ఇచ్చారు.మెరుగైన వైద్యం అందించడంతోబాటు బాధితునికి ప్రభుత్వంనుంచి మరింత ఆర్థికసహాయం అందించేలా కలెక్టర్, ఐటీడీఏ పీవో ఇతర ఉన్నతాధికారులను కోరనున్నట్టు ఆమె తెలిపారు.ఈకార్యక్రమంలో కోఆప్షన్‌సభ్యులు నాజర్‌వల్లి,వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్ నిర్మాణంలో నిర్వాసితులకు సాయం



వీఆర్వోల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు రామకృష్ణ

**చింతపల్లి:** జాతీయ రహదారి 516–ఈ నిర్మాణంలో భూములు, ఆస్తులు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అవసరమైన సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చింతపల్లి తహసీల్దారు రామకృష్ణ అన్నారు. మంగళవారం కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతపల్లి మండల పరిధిలో ఇప్పటికే జాతీయ రహదారి నిర్మాణంలో భూములు, దుకాణాలు, ఇళ్లు కోల్పోయిన వారి వివరాలన్నింటినీ సేకరించి ప్రభుత్వానికి నివేదించినట్టు చెప్పారు. ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే వారు అధికారులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యుటీ తహసీల్దారు రాజ్‌కుమార్, సర్వేయర్ సుభాకర్, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

### గంజాయికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ హిమగిరి

**అరకులోయ రూరల్:** యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని అరకులోయ సీఐ హిమగిరి తెలిపారు. గన్నేల పంచాయతీ తడక గ్రామంలో ఆయన యువకులతో మాట్లాడుతూ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులకు వివిధ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ మూఢనమ్మకాలను విడనాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కంటి శస్త్ర చికిత్సలకు గిరిజనుల తరలింపు



కంటి శస్త్రచికిత్సలకు తరలిస్తున్న గిరిజనులతో వైద్యులు

**చింతపల్లి:** కంటి శస్త్రచికిత్సలను ప్రభుత్వ పరంగా ఉచితంగా చేయిస్తున్నామని చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలోని దృష్టి ఐకేర్ ఎండీ ఆప్టోమెట్రిస్ట్ గాలి జగన్ తెలిపారు. పలు ప్రాంతాలకు చెందిన 14 మంది కంటి రోగులను శస్త్ర చికిత్సల నిమిత్తం మంగళవారం విశాఖ పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరందరికీ పూర్తి ఉచితంగా అవసరమైన శస్త్రచికిత్సలతోపాటు కంటి అద్దాలు, మందులు అందిస్తామన్నారు. ఇప్పటి వరకూ చింతపల్లి దృష్టి ఐకేర్‌ద్వారా సుమారు 1500 మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయించినట్టు చెప్పారు.

## తాగునీటి బోర్లకు విద్యుత్ మోటార్ల ఏర్పాటు



బోరు నుంచి నీరు విడిచిపెడుతున్న సర్పంచ్

**డుంబ్రిగుడ:** పంచాయతీ ప్రజల దాహార్తి తీర్చడమే ప్రధాన లక్ష్యమని గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరావు అన్నారు. పంచాయతీ పరిధిలో సోబురు, సరియావలస, జోగిపుట్టు, గంగవలస గ్రామాల్లో బోర్లకు మంగళవారం విద్యుత్ మోటార్లు అమర్చి తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాలు కురవడంతో ఊట గెడ్డలు, కొండవాగు గెడ్డల నుంచి వచ్చే నీరు పూర్తిగా కలుషితమవుతోందని,ఆ నీరు తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారని చెప్పారు. అందుకే పంచాయతీ నిధులతో నాలుగు బోర్లకు విద్యుత్ మోటర్లు అమర్చి తాగునీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

## దివ్యాంగుల సంక్షేమానికి కృషి



చెక్కు అందజేస్తున్న ఎంఈవో రామకృష్ణ

**రంపచోడవరం:** ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ ద్వారా దివ్యాంగుల సంక్షేమానికి, వారికి జీవనోపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు సీబీఆర్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుకుమార్ తెలిపారు. స్థానిక ఎంఆర్‌సీలో మంగళవారం పది మంది దివ్యాంగులకు ఆర్థిక సాయం అందజేశారు. ఒక్కొక్కరికీ రూ.5వేల చెక్కులను ఎంఈవో రామకృష్ణ అందజేశారు. ఒకరికి శస్త్రచికిత్స కోసం రూ.3వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సీబీఆర్ వలంటీర్లు ఎస్.దొరబాబు, ఎం.సతీష్, కె. వరలక్ష్మి, కె.కమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్‌పాత్‌ల ఆక్రమణ



ప్రధాన రహదారిలో నిలిచిన వాహనాలు

**అరకులోయ రూరల్:** మండల కేంద్రం అరకులోయలోని ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించి దుకాణాలు నిర్వహిస్తున్నారు.దీంతో పాదచారులు, టూరిస్టులు అధి క సంఖ్యలో రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుండడంతో నిత్యం ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. ఇదివరకు గ్రీన్‌వ్యాలీ జంక్షన్ సమీపంలో ఉన్న దుకాణాలను అధికారులు తొలగించారు. ఆ వ్యాపారులు అంబేడ్కర్ జంక్షన్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అధికంగా రద్దీ ఏర్పడి నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రద్దీ కారణంగా వారం రోజుల వ్యవధిలోనే మూడు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి దుకాణాలను పాత స్థలంలోనే ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాజ్‌మా సాగుతో అధిక ఆదాయం



రైతుకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ బోయినకుమారి

**గూడెంకొత్తవీధి:** రాజ్‌మా సాగుతో అధిక ఆదాయాన్ని పొందవచ్చని, గిరిజన రైతులు గంజాయి సాగును వీడి రాజ్‌మాను పండించాలని గూడెంకొత్తవీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన రాజ్‌మా విత్తనాలను మంగళవారం గూడెంకొత్తవీధిలో పంపిణీ చేసి, మాట్లాడారు. ఈకార్యక్రమంలో వైస్ఎంపీపీ లోతాదేముడు, ఎంపీటీసీలు రాజులమ్మ, నాగమణి కూటమి నాయకులు మహేష్, మండల వ్యవసాయాధికారి మధుసూధనరావు తదితరులు పాల్గొన్నారు.